సాక్షి
రాజన్న సిరిసిల్ల

శనివారం । 15 । మార్చి । 2025



వైభవంగా డోలోత్సవం

వేములవాడఅర్బన్: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం డోలోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు వేదమంత్రాల మధ్య వైభవంగా డోలోత్సవం నిర్వహించారు.



	ఇఫ్తార్ శుక్రవారం (సా॥)	సహర్ శనివారం (ఉ॥)
కరీంనగర్ :	6.28	5.05
పెద్దపల్లి :	6.31	5.03
సిరిసిల్ల :	6.26	5.13
జగిత్యాల :	6.31	5.03

న్యూస్‌రీల్

కాల్వ పనులు పూర్తి చేయండి

● కేంద్రమంత్రికి వినతిపత్రం



కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న రైతులు

ఇల్లంతకుంట(మానకొండూర్): రంగనాయక సాగర్ నుంచి ప్రారంభమై అసంపూర్తిగా ఉన్న ఎల్‌ఎం–6 కాల్వ పనులు పూర్తి చేసేందుకు సహకరించాలని దీక్ష చేస్తున్న రైతులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు విన్నవించారు. కరీంనగర్‌లో శుక్రవారం కలిసి ఈమేరకు వినతిపత్రం అందించి మాట్లాడారు. గత పన్నెండు రోజులుగా దీక్ష చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. రెండు కిలోమీటర్ల కాల్వ పూర్తిచేస్తే తంగళ్లపల్లి, ఇల్లంతకుంట మండలాల్లోని 9,500 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. భూమల్ల అనిల్‌కుమార్, వెన్నమనేని శ్రీధర్‌రావు, అమ్ముల అశోక్, పయ్యావుల బాలయ్య, గాదె మధుసూదన్, మల్లేశం ఉన్నారు.

నేడు గౌరపూర్ణిమ వేడుకలు



మాట్లాడుతున్న అచ్యుతానంద్‌దాస్

సిరిసిల్లకల్చరల్: అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం ఇస్కాన్ ఆధ్వర్యంలో తంగళ్లపల్లి మండలం నేరెళ్లలోని నూతన ఆలయ ప్రాంగణంలో శ్రీగౌర పూర్ణిమ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ స్థానిక ఇన్‌చార్జి ప్రాణనాథ అచ్యుతానంద్ దాస్ తెలిపారు. సిరిసిల్లలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. హోలీ పండుగ సందర్భంగా నిర్వహించే వేడుకలో హైదరాబాద్ నుంచి సుమారు 150 మందితోపాటు స్థానిక పరిసర గ్రామాల నుంచి 2వేలకు పైగా భక్తులు వస్తున్నారని పేర్కొన్నారు. శ్రీకృష్ణుడికి జలాభిషేకం, ఫల పంచామృతాభిషేకాలు, హరినామ సంకీర్తనలు నిర్వహిస్తామని వివరించారు. ఇస్కాన్ ప్రతినిధులు మంగళారపు ప్రభాకర్ పాల్గొన్నారు.

నేడు 'సఖీ' కేంద్రం పోస్టులకు ఇంటర్వ్యూ

సిరిసిల్ల: సఖీ కేంద్రంలోని పోస్టులకు శనివారం ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం శుక్రవారం తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను జిల్లా వెబ్‌సైట్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో క్రీడాపోటీలు

సిరిసిల్లకల్చరల్: నెహ్రూ యువకేంద్రం, బీసీ యూత్ అసోసియేషన్ సంయుక్తంగా ఆది, సోమవారాల్లో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎన్‌వైకే మాజీ వలంటీర్ గంగిపెల్లి స్వామికుమార్ తెలిపారు. అగ్రహారంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగే స్పోర్ట్స్‌మీట్‌లో వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, షాట్‌పుట్, రన్నింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 30 ఏళ్లలోపు వారు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల జట్లు 81214 58893, 95153 99531లలో సంప్రదించాలని సూచించారు.

నేత్రపర్వంగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

చందుర్తి(వేములవాడ): మండలంలోని బండపల్లి శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవం కనుల పండువగా సాగింది. ఆలయంలో ఉదయం 10 గంటల వరకు నిత్యారాధన, 10.30 గంటలకు రథహోమం, పూర్ణాహుతి, రథ బలిహరణ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీకాంతాచార్యులు ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులకు పంచామృత అభిషేకం జరిపించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొండ లక్ష్మణ్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడు ఏనుగు లచ్చిరెడ్డి, వీడీసీ అధ్యక్షుడు కటకం చంద్రయ్య, నాయకులు మల్యాల గంగనర్సయ్య, లింగంపల్లి బాబు, అంబాల శ్రీకాంత్, గంప పవన్, కటకం రవి, అటుకుల మధు, గ్రామస్తులు పాల్గొన్నారు. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అంజయ్య, ప్రొబేషనరీ ఎస్సై అనిల్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు.

హోలీ.. జాలీ



సిరిసిల్లలో రంగులు పూసుకుంటున్న చిన్నారులు



సిరిసిల్లలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో హోలీ వేడుకల్లో యువత



హోలీ సంబరాల్లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



వేములవాడ రాజన్న ఆలయం ఎదుట పట్టణ యువకులు

సిరిసిల్ల/సిరిసిల్లటౌన్/వేములవాడఅర్బన్: జిల్లా ప్రజలు హోలీ సంబరాల్లో మునిగితేలారు. శుక్రవారం ఉదయం నుంచే రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. సిరిసిల్లలో గల్లీలు రంగులమయంగా మారాయి. డీజేల మ్యూజిక్ మధ్య రంగులు పూసుకుంటూ ఎంజాయ్ చేశారు. జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ మహేశ్ బి.గీతే తమ క్యాంపు ఆఫీసులో సిబ్బందితో హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు స్థానికులతో కలిసి వేడుకలు జరుపుకున్నారు. ఎస్పీ మహేశ్ బి.గీతేకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, పార్టీ నాయకులు ఆడెపు రవీందర్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి బర్కం నవీన్ యాదవ్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మ్యాన రాంప్రసాద్ డీపీవోకు శుభాకాంక్షలు తెలిపారు.



చిన్నారుల నృత్యం

కల్తీ.. మోసం!



ఇది సిరిసిల్లలోని ఓ సూపర్‌మార్కెట్‌లో 25 కిలోల బియ్యం బస్తా. ఓ వినియోగదారులు శుక్రవారం కొనుగోలు చేసి తూకం వేయగా.. పావుకిలో తక్కువగా వచ్చింది. దీనిపై దుకాణదారుడిని ప్రశ్నిస్తే తనకేమి తెలియదన్నాడు. దీంతో చేసేదేమి లేక కొనుగోలు దారుడు ఆ బస్తానే తీసుకెళ్లాడు.



ఇక్కడ చేపలు కొనుగోలు చేస్తున్న ప్రదేశం సిరిసిల్లలోని మార్కెట్. చేపల వ్యాపారులు బండరాళ్లనే తూకంబాట్లుగా వాడుతున్నారు. వాటి బరువు ఎంత ఉందో కూడా వినియోగదారులకు తెలియదు. వ్యాపారీ ఎంత బరువుందో చెప్పితే అంత మొత్తానికి డబ్బులు ఇచ్చి తీసుకెళ్తున్నారు. కానీ ఎవరూ ఆ బండరాళ్ల బాట్లపై ప్రశ్నించడం లేదు.



అన్ని రంగాలు డిజిటల్ వైపు వెళ్తుంటే.. సిరిసిల్లలోని కొందరు కూరగాయల వ్యాపారులు ఇంకా కాంటానే వినియోగిస్తున్నారు. కాంటాలో తూకం వేసిన కూరగాయలను డిజిటల్ కాంటాపై తూకం వేస్తే బరువులో తేడాలు వస్తున్నాయి. అయినా ఆ పాతరకం కాంటాలను మాత్రం మార్చడం లేదు.

● మార్కెట్‌లో నాణ్యత లేని వస్తువుల విక్రయం
● తూకంలోనూ తేడాలు
● అధికారుల తనిఖీలు కరువు
● నేడు వినియోగదారుల దినోత్సవం

సిరిసిల్లకల్చరల్: మార్కెట్‌లో అడుగడుగునా మోసాలే. తూకం నుంచి మొదలుపెడితే వస్తువు నాణ్యత వరకు అంతా పైపై మెరుగులే. వ్యాపారం చేసేందుకు ప్రసారం చేస్తున్న ప్రకటనలకు అనుగుణంగా వస్తువుల నాణ్యత ఉండడం లేదు. నిర్దిష్ట పరిణామాల ప్రకారం వస్తువులు సైతం లభించడం లేదు. ఫలితంగా వినియోగదారుడు మోసపోతూనే ఉన్నాడు. అవగాహన లేక వినియోగదారులు తమ హక్కుల కోసం పోరాడడం అటుంచితే కనీసం ప్రశ్నించడం లేదు. మార్కెట్‌లో దొరికిందే వస్తువు.. చెప్పిందే ధరగా నడుస్తోంది. వినియోగదారుల దినోత్సవం సందర్భంగా మార్కెట్‌లో జరుగుతున్న మోసాలపై 'సాక్షి' ఫోకస్.

ఆన్‌లైన్ మోసాలు.. ఆధునిక చట్టాలు

నాణ్యమైన వస్తువులు సరఫరా చేయడం తయారీదారుడి బాధ్యత.. లోపం లేని వస్తు సేవలు పొందడం కొనుగోలుదారుడి ప్రధాన హక్కు. అయితే ధనార్జనే ధ్యేయంగా కొందరు వ్యాపారులు కొనుగోలుదారులను మోసం చేస్తూనే ఉన్నారు. అయితే నష్టపోయిన వినియోగదారులకు న్యాయం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 1986లో వినియోగదారుల చట్టం తీసుకొచ్చింది. కాలక్రమేణ వ్యాపార సరళిలో మార్పులు వచ్చాయి. ఆన్‌లైన్‌లో కొనుగోళ్లు పెరిగిపోయాయి. కొత్త రకం మోసాలకు తెరలేచిన వేళ 2019లో దీనికి అనుబంధంగా మరో కొత్త చట్టాన్ని అమలు చేసింది. అక్రమ వాణిజ్య పద్ధతులు, మోసపూరిత ప్రకటనలపై కొరడా ఝుళిపించేలా చట్టాలను రూపొందించింది. వినియోగదారుల రక్షణ మండళ్లు, మధ్యవర్తిత్వ ప్యానెళ్ల ఏర్పాటుతోపాటు ఈ–మెయిల్ ద్వారా ఫిర్యాదుల స్వీకరణ, వీడియో కాన్ఫరెన్స్‌లో కేసుల పరిష్కారం వంటి కొత్త విధానాలను పొందుపరిచింది.



తూనికలు, కొలతల శాఖ కార్యాలయం

వినియోగదారుల ఫోరాన్ని ఇలా ఆశ్రయించాలి

కొన్న వస్తువులో నాణ్యతలోపం, సేవల్లో నిర్లక్ష్యం, తూకంలో తేడా, నకిలీవస్తువు.. అని గుర్తించిన పక్షంలో సదరు వ్యాపారీపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు. రూ.20లక్షలలోపు పరిహారానికి జిల్లా ఫోరంలో, రూ.కోటి లోపు రాష్ట్ర ఫోరంలో, అంతకుమించి పరిహారం కోసం జాతీయ కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చు.

జిల్లాలో జాడ లేని వినియోగదారుల కమిషన్

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఏర్పడిన జిల్లాల్లో వినియోగదారుల కమిషన్‌ల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి సారించలేదు. ఇప్పటికీ కొత్త జిల్లాల్లో కమిషన్‌లు లేవు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉన్న ఫోరం కమిషన్‌గా పరిణామం చెందింది. కానీ నిర్వహణ లోపభూయిష్టంగా ఉంది. ఏళ్లుగా కమిషన్‌కు చైర్మన్‌ను నియమించలేదు. కమిషన్‌లో సరిపడినంత సిబ్బంది లేరు. ఇప్పటికీ 720 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. సగటున నెలకు 21 నుంచి 25 కేసులు నమోదవుతున్నాయి.

చట్టంపై అవగాహన పెంచాలి



వినియోగదారుల హక్కులను రక్షించేందుకు రూపొందించిన చట్టంపై మొదట్లో కొంత ప్రచారం జరిగింది. కానీ కొన్నేళ్లుగా పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. అవగాహన పెంచాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేకంగా రక్షణ మండళ్లను ఏర్పాటు చేయాలి. చట్టంపై అవగాహన పెంచేందుకు ప్రచార కార్యక్రమాలు రూపొందించాలి. వ్యాపార సంస్థల్లో సంబంధిత అధికారులు తరచూ తనిఖీలు చేపట్టాలి. ప్రజలు కూడా ఈ చట్టాన్ని వినియోగించుకునేందుకు ముందుకు రావాలి.

– బియ్యంకార్ శ్రీనివాస్, పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు

అంతా కనికట్టు.. మోసం కనిపెట్టు



ఓవైపు పెట్రోలు కల్తీ ..మరోవైపు కొలతల్లో తేడాలు...అంతేకాకుండా కనీస సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం.. ఇదీ ఉమ్మడి జిల్లాలో అధిక శాతం పెట్రోలు బంకుల్లో పరిస్థితి. ఎక్కడా నిబంధనలు పాటించిన దాఖలాలు కనిపించవు. త్వరగా గమ్యం చేరాలనే వినియోగదారుడి ఆరాటం..అవగాహన లోపం.. బంకుల యాజమాన్యాలకు కలసివస్తోంది. 8లో▸

వన్యప్రాణుల దాహార్తి తీర్చేలా..



ఇది అల్మాస్‌పూర్ రేంజ్ పరిధిలోని దట్టమైన అడవిలో అటవీశాఖ అధికారులు నీటి తొట్టీలు ఏర్పాటు చేశారు. ఎండాకాలంలో అటవీజంతువుల దాహార్తి తీర్చేందుకు నీటితొట్టీలు ఏర్పాటు చేసి వాటి ప్రాణాలు కాపాడుతున్నారు. ఏటా ఎండాకాలంలో చెట్లు ఆకు రాలిపోవడం, నీటి వనరులు ఎండిపోవడంతో జంతువులు తాగు నీటి కోసం ఇబ్బంది పడుతుంటాయి. వాటిని రక్షించేందుకు ఫారెస్ట్ అధికారులు నీటితొట్టీలను ఏర్పాటు చేస్తుంటారు.

● ఎండాకాలంలో అటవీజంతువులకు అండగా..
● నీటికుండీలు ఏర్పాటు చేస్తున్న ఫారెస్ట్ అధికారులు
● నిత్యం ట్యాంకర్ల ద్వారా నింపుతున్న వైనం
● జిల్లాలో 78 నీటి తొట్టీలు
● మండు వేసవిలో దాహార్తి తీర్చుకుంటున్న వన్యప్రాణులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎండాకాలంలో అటవీలోనూ నీటి నిల్వలు అడుగంటిపోతున్నాయి. వాగులు, వంకలు, చెలిమెల్లో నీరింకిపోయింది. ఈక్రమంలో దాహార్తి తీర్చుకునేందుకు అటవీ జంతువులు అల్లాడుతున్నాయి. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో గ్రామాల శివారులోని పంటపొలాలకు నీటి కోసం వన్యప్రాణులు వస్తున్నాయి. ఈక్రమంలో రైతులు పెడుతున్న విద్యుత్ కంచెలకు తాకి కరెంట్ షాక్‌తో చనిపోతున్నాయి. ఇలాంటి సంఘటనలకు చెక్ పెట్టేందుకు అటవీశాఖ అధికారులు ముందుకొచ్చారు. అడవిలోనే వన్యప్రాణులు దప్పిక తీర్చుకోవడానికి జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ రెండు రేంజ్‌ల పరిధిలో 78 నీటి కుండీలను ఏర్పాటు చేసి వాటికి తాగునీరు అందిస్తున్నారు.

ట్యాంకర్ల ద్వారా సరఫరా..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పశ్చిమ డివిజన్‌లో దట్టమైన అటవీ ప్రాంతం రాజన్నసిరిసిల్ల జిల్లాలో ఉంది. ఇక్కడ పచ్చని అడవి విస్తరించి ఉండడంతో ఈ ప్రాంతంలో అధిక సంఖ్యలో వన్యప్రాణులు బతుకుతున్నాయి. వర్షాకాలం, శీతాకాలాల్లో అటవీలోని నీటివనరుల్లో దాహార్తి తీర్చుకునేవి. ప్రస్తుతం ఎండలు ముదిరిపోవడంతో ఫారెస్ట్‌లోని నీటి వనరులు అడుగంటిపోయాయి. ఆకురాలే కాలంలో అడవిలో ఆహారం దొరక్క, నీరు లేక జిల్లాలోని గంభీరావుపేట మండలంలోని పెద్దమ్మజంగల్, చందుర్తి, రుద్రంగి, వీర్నపల్లి, కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట, జగిత్యాల జిల్లా మల్యాల ప్రాంతాల్లో వన్యప్రాణులు చనిపోతున్నాయి. మరీ ముఖ్యంగా కోతులు నీటి కోసం గ్రామాల్లోకి వస్తున్నాయి. అటవీ జంతువులు గ్రామాల్లోకి నీటి కోసం రావడం ప్రమాదాలకు గురి కావడం జరుగుతోంది. దీంతో గ్రామీణులు కూడా ఇబ్బంది పడుతున్నారు. వన్యప్రాణుల ఇబ్బందులను గుర్తించిన అధికారులు దట్టమైన అడవిలో నీటి తొట్టిలను ఏర్పాటు చేసి నిత్యం ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతున్నారు.



అటవీలో ఏర్పాటు చేసిన నీటి సాసర్

రెండు రేంజ్‌ల పరిధిలో..

రాజన్నసిరిసిల్ల జిల్లాలో రెండు ఫారెస్ట్ రేంజ్‌లు సిరిసిల్ల, వేములవాడ. సిరిసిల్ల రేంజ్ పరిధిలో 58 నీటితొట్టీలు, సాసర్లను నిర్మించారు. వీటిలో నీటిని నింపేందుకు 3 ట్యాంకర్లను ఏర్పాటు చేశారు. వేములవాడ రేంజ్ పరిధిలో 20 నీటి తొట్టిలను గతంలోనే ఏర్పాటు చేశారు. అవే తొట్టిలలో అధికారులు నిత్యం నీరు నింపుతూ.. వన్యప్రాణుల దహార్తిని తీర్చుతున్నారు. కాగా ఎల్లంపల్లి కాలువల ద్వారా వేములవాడ రేంజ్‌లోని కొన్ని ప్రాంతాల్లో నీటి కాలువలు ఉండడం మూలంగా అక్కడే జంతువులు దాహార్తిని తీర్చుకుంటున్నట్లు అధికారులు చెపుతున్నారు.

దాహార్తిని తీరుస్తున్నాం..

ఎండాకాలంలో అడవిలో నీటి వనరులు ఎండిపోతుంటాయి. ఈ నేపథ్యంలో అటవీ జంతువుల దాహార్తి తీర్చేందుకు నీటితొట్టీలు, సాసర్లను నిర్మించి, ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతున్నాం. వన్యప్రాణులు కుండీల వద్దకు వచ్చి దాహార్తి తీర్చుకుంటున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి నిధులు రాకున్నా.. శాఖాపరంగా నీటితొట్టీలను ఏర్పాటు చేస్తున్నాం. వన్యప్రాణుల రక్షణ కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– శ్రీహరిప్రసాద్, సిరిసిల్ల ఫారెస్ట్ రేంజ్ అధికారి

కమనీయం.. నృసింహుని కల్యాణం



రుద్రంగి: కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

రుద్రంగి(వేములవాడ): మండల కేంద్రంలోని శ్రీ ధర్మపురి లక్ష్మీనర్సింహ స్వామి కల్యాణాన్ని శుక్రవారం గంగపుత్ర సంఘం సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల సౌకర్యార్థం గంగపుత్ర సంఘం సభ్యుల ఆధ్వర్యంలో మహా అన్నదానం చేశారు. గంగపుత్ర సంఘం అధ్యక్షుడు దేశవేని ధర్మేందర్, సభ్యులు భూమయ్య, శ్రీనివాస్, భూమేశ్, గంగాధర్, విక్రమ్, వినోద్, రాజశేఖర్ పాల్గొన్నారు.



ఇల్లంతకుంట: ముస్కానిపేటలో..

ఇల్లంతకుంట(మానకొండూర్): ముస్కానిపేటలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా ఆలయంలో వివిధ హోమాలు, పూజాకార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామివారికి ఒడిబియ్యం సమర్పించారు. ఆలయం వద్ద అన్నదాన చేశారు. ఆలయ చైర్మన్ బద్దం హనుమంతరెడ్డి, కార్యవర్గం, గ్రామ ప్రముఖులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

పండుగ పూట.. నిరసన బాట



దీక్షలో నాయకులు

సిరిసిల్లటౌన్: ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో పండుగపూట శుక్రవారం నిరసన బాట పట్టారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు అమలయ్యే వరకు ఉద్యోగ నియామక పరీక్షల ఫలితాలు వాయిదా వేయాలని కోరుతూ చేపట్టిన దీక్షలు ఐదో రోజుకు చేరాయి. ఈ దీక్షల్లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఆవునూరి ప్రభాకర్, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్, బడుగు లింగన్న, చిట్యాల మధు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన

● కేసీఆర్‌పై సీఎం వ్యాఖ్యలు శోచనీయం
● బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య
● సిరిసిల్లలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

సిరిసిల్లటౌన్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రాక్షస పాలన సాగిస్తోందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలు, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ సిరిసిల్లలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆగయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి అక్రమాలను, అరాచక పాలనను ఎండగడుతున్న జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడం హేయమైన చర్యగా విమర్శించారు. ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. భారత రాష్ట్ర సమితి పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరు ప్రవీణ్, నాయకులు బొల్లి రామ్మోహన్, గజభీంకార్ రాజన్న, పడిగల రాజు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

క్లుప్తంగా

సౌదీలో ఆత్మహత్య.. ఇక్కడ విషాదం


వెంకటేశం (ఫైల్)

ఇల్లంతకుంట(మానకొండూర్): ఆరు నెలల క్రితం సౌదీ అరేబియాకు వెళ్లిన మండలంలోని నర్సక్కపేటకు చెందిన ముత్యం వెంకటేశంగౌడ్ ఆత్మహత్యతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నర్సక్కపేటకు చెందిన వెంకటేశంగౌడ్(51) సౌదీ అరేబియాకు గత 35 ఏళ్లుగా వెళ్లి వస్తున్నాడు. ఈ క్రమంలో ఆరు నెలల క్రితం స్వదేశానికి వచ్చి మళ్లీ సౌదీ వెళ్లాడు. అతను ఉంటున్న గదిలోనే ఉరివేసుకున్నాడు. పది రోజుల క్రితమే వెంకటేశంగౌడ్ కొడుకు సైతం సౌదీకి వెళ్లాడు. అయితే తండ్రి చేస్తున్న కంపెనీలో పనికి వెళ్లినా.. ఇద్దరు వేర్వేరు గదుల్లో ఉంటున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కమాన్‌పూర్(మంథని): గుండారం గ్రామ పరిధిలోని రాజాపూర్ గ్రామానికి చెందిన గరిగంటి ఓదెలు(70) అనే సింగరేణి రిటైర్డ్ కార్మికుడు గురువారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ప్రసాద్, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఓదెలు సంగరేణి సంస్థలో పనిచేసి కొన్నేళ్లక్రితం ఉద్యోగ విరమణ చేశారు. ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటున్నాడు. కొద్ది నెలల క్రితం మతిస్థిమితం కోల్పోయింది. ఇక్రమంలో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య ఓదెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్నట్లు ఎస్సై తెలిపారు.

తేనెటీగల దాడిలో నలుగురికి గాయాలు

శంకరపట్నం: తేనేటీగల దాడిలో మండలంలోని తాడికల్ గ్రామానికి చెందిన నలుగురికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. గ్రామానికి చెందిన దుబ్బాక నర్సయ్య, రజిత, సమ్మెట మహేందర్, శ్రీజ బైక్‌పై తిమ్మాపూర్ మండలం నల్గొండ జాతరకు వెళ్తుండగా తేనేటీగలు దాడిచేశాయి. గాయపడిన నలుగురిని చికిత్స నిమిత్తం 108లో హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

వంతెన పైనుంచి పడి బీటెక్ విద్యార్థికి గాయాలు

ఓదెల(పెద్దపల్లి): గుంపుల గ్రామ శివారులోని రామభద్రవంతెన పైనుంచి పడటంతో బీటెక్ విద్యార్థి అబ్బు కార్తీక్‌రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. రామగిరి మండలం కాసిపల్లి గ్రామానికి చెందిన కార్తీక్‌రెడ్డి హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాడు. తన అమ్మమ్మ స్వగ్రామం కాల్వశ్రీరాంపూర్ మండలం మల్యాలకు బైక్‌పై వస్తున్నాడు. ఈక్రమంలో బైక్ అదుపుతప్పి వంతెన పైనుంచి పడిపోయాడు. ఈ ఘటనలో విద్యార్థి కాలు విరిగింది. అంబులెన్స్‌లో జమ్మికుంటకు తరలించారు.

దొంగకు 8 నెలలు జైలు

వేములవాడఅర్బన్: సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లిన దొంగకు ఎనిమిది నెలల జైలు, రూ.100 జరిమానాను వేములవాడ న్యాయస్థానం విధించినట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. నిర్మల్ పట్టణానికి చెందిన రాథోడ్ బాలాజీ, వేములవాడకు చెందిన మంజీడి రాజయ్య నుంచి తంగళ్లపల్లికి చెందిన ఇర్ఫాన్ రెండు సెల్ ఫోన్‌లను చోరీచేశాడు. 2024 జూన్‌లో వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు నమోదయ్యాయి. రెండు కేసులకు సంబంధించి పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి జ్యోతిర్మయి నిందితునికి 8 నెలల జైలు, రూ.100 జరిమానా విధించినట్లు తెలిపారు.

విజేతలు.. కొలువులో జగజ్జేతలు

- గ్రూప్–3లో సత్తాచాటిన జిల్లా యువత
- 21వ ర్యాంక్‌తో మెరిసిన మహేశ్
- 72, 103, 113, 205 ర్యాంక్‌లు జిల్లా సొంతం

ఉన్నత ఉద్యోగం సాధించాలనే తపన.. మంచి ర్యాంక్‌తో మెరవాలనే పట్టుదల ఫలించింది. ఏళ్ల కఠోరశ్రమకు సరైన గౌరవం దక్కింది. సాధారణ, మధ్యతరగతి కుటుంబాల్లో పుట్టినవారంతా ఉన్నత ఉద్యోగాలు సాధించి శభాష్ అనిపించుకున్నారు. వరుసగా ప్రభుత్వం ప్రకటిస్తున్న పరీక్షల ఫలితాల్లో ప్రతిభ చూపుతున్నారు. శుక్రవారం విడుదలైన గ్రూప్–3 పరీక్ష ఫలితాల్లో జిల్లాకు చెందిన యువత సత్తాచాటారు. రాష్ట్రస్థాయిలో 21, 72, 103, 113, 205వ ర్యాంక్‌లతో రాణించారు.

21వ ర్యాంక్‌తో సత్తాచాటిన మహేశ్



ముత్తారం(మంథని): ముత్తారం మండలం సీతంపల్లికి చెందిన గంట మహేశ్ గౌడ్ గ్రూప్–3 ఫలితాల్లో రాష్ట్రస్థాయి 21వ ర్యాంకు సాధించాడు. ఇటీవల విడుదలైన గ్రూప్–2 ఫలితాల్లో స్టేట్ 143వ ర్యాంకు సాధించాడు. ఇప్పటికే గ్రూప్–4 ఉద్యోగంతో పెద్దపల్లి పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. మైనింగ్ ఇంజినీరింగ్ పూర్తిచేసిన మహేశ్ ఇప్పటికే గ్రూప్–4 ఉద్యోగం చేస్తుండగా ప్రస్తుతం గ్రూప్–2, 3 సాధించాడు. గ్రూప్–2 ఉద్యోగంలో చేరుతానని తెలిపారు.

ఉద్యోగాల నిఖిల్‌రెడ్డి



ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని పెద్దలింగాపూర్‌కు చెందిన కదారి నిఖిల్‌రెడ్డి గ్రూపు–3 ఫలితాల్లో 113వ ర్యాంకు సాధించాడు. నిఖిల్‌రెడ్డి కొండగట్టులోని జేఎన్టీయూలో ఇంజినీరింగ్ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. మూడు నెలల క్రితం ప్రకటించిన గ్రూపు–4 ఫలితాల్లో సత్తాచాటి కమర్షియల్ టాక్సెస్ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా చేరాడు. ఉద్యోగం చేస్తూనే ఇంటి వద్ద ఉండి ప్రిపేర్ అయి గ్రూప్–2లో 256వ ర్యాంకు, గ్రూప్–3లో 113వ ర్యాంకు సాధించాడు. పట్టుదలతో చదివితే ఉద్యోగాలు వరుసకడతాయని నిఖిల్‌రెడ్డి నిరూపించాడు. తండ్రి రాజిరెడ్డి నిర్మల్ జిల్లాలో పీజీహెచ్ఎంగా విధులు నిర్వహిస్తుండగా, తల్లి జయ గృహిణి.

మెరిసిన పేదింటి బిడ్డ



వీణవంక(హుజూరాబాద్): వీణవంక మండలం నర్సింగాపూర్‌కు చెందిన కొక్కుల విశ్వసారథి గ్రూపు–3లో రాష్ట్రస్థాయి 205వ ర్యాంకు సాధించాడు. కొక్కుల సమ్మయ్య–అర్చన దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్నకుమారుడు విశ్వసారథి గ్రూప్–4 ఉద్యోగంలో భాగంగా యాదాద్రి జిల్లాలో జూనియర్ అసిస్టెంట్ పనిచేస్తున్నాడు. ఉద్యోగం చేస్తూనే గ్రూపు–2కి ప్రిపేర్ అయ్యాడు. ఇటీవల ఫలితాలు వెల్లడి కాగా 566వ ర్యాంక్ వచ్చింది. శుక్రవారం విడుదలైన గ్రూప్–3లో రాష్ట్రస్థాయి 205వ ర్యాంక్ సాధించడంపై గ్రామస్తులు అభినందించారు.

సొంత ప్రిపరేషన్‌తో 72వ ర్యాంక్



జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట మండల కేంద్రానికి చెందిన కాంతాల సాయిప్రశాంత్‌రెడ్డి రాష్ట్రస్థాయిలో 72వ ర్యాంకు సాధించాడు. ఇటీవల ప్రకటించిన గ్రూప్–2లో 95వ ర్యాంకుతో మెరిశాడు. ఇప్పటికే గ్రూప్–4 ఉద్యోగం.. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలంలో హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నాడు. ఇంటి వద్దనే ఉంటూ సొంత ప్రిపరేషన్‌తో మూడు పరీక్షల్లో ప్రతిభ చూపాడు.

శ్రమించి.. జయించి



రాయికల్(జగిత్యాల): రాయికల్ మండలం ఆలూరుకు చెందిన సురతాని మల్లారెడ్డి–భాగ్య దంపతుల కుమారుడు అరవింద్‌రెడ్డి గ్రూప్–3లో 103వ ర్యాంక్ సాధించాడు. ఇటీవల విడుదలైన గ్రూప్–1 ఫలితాల్లోనూ 421 మార్కులతో తన ప్రతిభ చాటాడు. ఈ సందర్భంగా అరవింద్‌రెడ్డిని గ్రామస్తులు, విద్యావేత్తలు అభినందించారు.

అంతా కనికట్టు.. మోసం కనిపెట్టు

అరె నిన్ననే రూ. 200 పెట్రోల్ పోయించాను.. ఒక్కరోజు తిరగకముందే అయిపోయింది..అని బంకులో అడిగితే ఎండాకాలం కదా సర్.. పెట్రోల్ బాగా ఆవిరి అవుతందని చెప్పాడు.. కోరుట్లకు చెందిన నవీన్ ఆవేదన.

నిన్నటి దాకా నా మోటార్‌సైకిల్ ఇంజన్ సౌండ్ బాగానే ఉంది. ఇవాళే ఇలా ఎక్కువ శబ్దం వస్తుంది..పెట్రోల్ కల్తీ అయిందా అని అనుమానం వ్యక్తం చేశాడు మెట్‌పల్లికి చెందిన గంగాధర్.



- పెట్రోల్ బంకుల్లో కొలతల తిరకాసు
- వినియోగదార్లు అప్రమత్తంగా ఉండాల్సిందే..
- కొలతల్లో తేడాలతో నష్టం



కోరుట్ల: ఓవైపు పెట్రోలు కల్తీ ..మరోవైపు కొలతల్లో తేడాలు...అంతేకాకుండా కనీస సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం.. ఇదీ ఉమ్మడి జిల్లాలో అధిక శాతం పెట్రోలు బంకుల్లో పరిస్థితి. ఎక్కడా నిబంధనలు పాటించిన దాఖలాలు కనిపించవు. త్వరగా గమ్యం చేరాలనే వినియోగదారుడి ఆరాటం..అవగాహన లోపం.. బంకుల యాజమాన్యాలకు కలసివస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వివిధ కంపెనీలకు చెందిన సుమారు 380 వరకు పెట్రోల్ బంక్‌లు ఉన్నాయి. రోజూ ఏదో ఓ చోట కల్తీ పెట్రోల్ సమస్యలతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. పెట్రోల్ సరాఫరా చేసే ట్యాంకర్లు సాధారణంగా 4 వేల నుంచి 30 వేల ట్యాంకర్లు ఉంటాయి. ఉదహారణకు 12 వేల లీటర్ల ట్యాంకర్‌లో 4 వేల లీటర్లకు ఓ చాంబర్ చొప్పున మూడు చాంబర్ గదులు ఉంటాయి. పెట్రోల్‌లో పొగ కాలుష్యం రాకుండా 10 శాతం ఇథనాల్ కలుపుతారు. బంకుల్లో పెట్రోల్‌ను నిల్వ చేసే ఇనుప ట్యాంకుకు చిన్నపాటి లీకేజీ ఉన్నా అక్కడి నుంచి నీరు కలిస్తే పెట్రోల్‌లో కలిపే ఇథనాల్ మొత్తం నీరుగా మారిపోతుంది. ఈ పెట్రోల్‌ను వాడితే వాహనాల ఇంజిన్ చెడిపోవడం జరుగుతుంది.

కొలతల్లో మోసాలకు చాన్స్

పెట్రోల్ బంకుల్లో రోజూ టెస్టింగ్ కింద 5 లీటర్ల పెట్రోల్ పోయాల్సి ఉంటుంది. ఎలక్ట్రానిక్ పెట్రోల్ బంక్ మిషన్లలో టెస్టింగ్‌కు సంబంధించిన కొలతల్లో ఏమైనా తేడాలు ఉంటే కంపెనీ నుంచి పెట్రోల్ పోయడం ఆటోమేటిక్ సిస్టమ్ ద్వారా లాక్ చేయడం జరుగుతోంది. కొన్ని బంకుల యాజమాన్యాలు ఎలక్ట్రికల్ వేయింగ్ మిషన్లను ట్యాంపరింగ్ చేస్తున్నాయి. లీటరు పెట్రోల్‌కు 100 నుంచి 200 మిల్లీలీటర్ల వరకూ పక్కదారి పట్టిస్తున్నాయి. ఏరోజుకారోజు పెట్రోల్, డీజిల్ ధరలను ప్రదర్శించాల్సి ఉన్నా ఎక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు. వాస్తవానికి పెట్రోల్ నాణ్యతను తెలుసుకునేందుకు బంకుల వద్ద ఫిల్టర్ పేపర్ టెస్ట్ అందుబాటులో ఉంచాలి. కానీ, ఈ విషయం చాలామంది వినియోగదారులకు తెలియదు. బంకులు అందుబాటులో లేనిచోట విడిగా విక్రయాల పేరిట భారీ దోపిడీ జరుగుతోంది. లీటరు పెట్రోల్‌ను రూ.120కిపైగా విక్రయిస్తున్నారు. పైగా కిరోసిన్ కలిపి అమ్మకాలు చేస్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

- కొన్ని పెట్రోల్ బంక్‌లో చిప్స్ అమరికతో రూ.100, రూ.200, రూ.300, రూ.500 పెట్రోల్ పోసినప్పుడు రీడింగ్‌లో తక్కువ వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీన్ని నివారించడానికి మనం రూ.110, రూ. 210 పెట్రోల్ పోయించుకోవడం మంచిది.
- ఒక్కోసారి పెట్రోల్ పోస్తున్న సమయంలో రీడింగ్ ఒకేసారి జంప్ అవుతుంది. ఇలా జంప్ అయిన సందర్భాల్లో జాగ్రత్త పడి రీడింగ్ నెమ్మదిగా ఉండేలా పెట్రోల్ పోయమని చెప్పాలి.
- అలాగే బంకుల వద్ద ఆరు రకాల సేవలు అందుబాటులో ఉండాలి. లేకుంటే సంబంధిత యాజమాన్యాలపై చర్యలు తీసుకోవచ్చు.
- బంకుల వద్ద ఫిల్టర్ పేపర్ టెస్ట్ అందుబాటులో ఉంచాలి. ఆ పేపరుపై రెండు మూడు చుక్కలు పెట్రోల్ వేస్తే అది ఆవిరైపోతే నాణ్యత కలిగినదిగా గుర్తించవచ్చు. అదే మరకలుగా మిగిలిపోతే కల్తీ జరిగినట్టు నిర్ధారించవచ్చు.
- అత్యవసర, అనారోగ్య సమయాల్లో సమాచారం అందించేందుకు బంకుల వద్ద ఫోన్ అందుబాటులో ఉంచాలి.

తనిఖీల ఊసే లేదు

ఏరోజుకారోజు బంకుల వద్ద పెట్రోల్, డీజిల్ ధరలు ప్రదర్శించాలి. పెట్రోల్, డీజిల్‌లో నాణ్యత కొరవడితే ఏ అధికారికి ఫిర్యాదు చేయాలి? ఎవరిని సంప్రదించాలి? వంటి ఫోన్ నంబర్ల వివరాలు నోటీసు బోర్డులో ఉంచాలి. కానీ, కొద్ది బంకుల్లోనే ఇటువంటివి పాటిస్తున్నారు. వాస్తవానికి తమ పరిధిలో ఉండే బంకులను తూనికలు, కొలతల శాఖ అధికారులతో పాటు స్థానిక రెవెన్యూ సిబ్బంది నిత్యం తనిఖీ చేయాలి. కానీ, అసలు తనిఖీలే ఉండడం లేదు. ఎక్కడైనా ఆరోపణలు వచ్చినా.. వాహనదారుల నుంచి ఫిర్యాదులు వచ్చినా అధికారులు హడావుడి చేస్తున్నారు. తర్వాత ఆ మాటే మరిచిపోతున్నారు. అసలు జిల్లాలో తూనికలు, కొలతల శాఖ ఒకటి ఉందన్న విషయమే తెలియడం లేదు. బయటకు సిబ్బంది కొరత అని సంబంధిత అధికారులు చెబుతున్నారు. కానీ, నెలనెలా మామూళ్లు అందడం వల్లే చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

హోలీరోజు విషాదం

- ఎస్సారెస్పీ కాలువలో కొట్టుకుపోయి యువకుడు మృతి


సాగర్‌గౌడ్ (ఫైల్)

జగిత్యాలక్రైం: హోలీ పండగ రోజు స్నేహితులతో సరదాగా గడిపి స్నానం చేసేందుకు వెళ్లిన యువకుడు ఎస్సారెస్పీ కాలువలో గల్లంతై మృతిచెందాడు. స్థానికులు, పోలీసుల వివరాలు.. జగిత్యాల జిల్లా జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన గొల్లపల్లి సాగర్‌గౌడ్ (32) శుక్రవారం హోలీ పండగ కావడంతో స్నేహితులతో సరదాగా హోలీ ఆడుకున్నారు. అనంతరం వెల్దుర్తి, బావోజిపల్లి గ్రామ శివారులో ఎస్సారెస్పీ కాలువలో స్నేహితులతో కలిసి స్నానం చేసేందుకు వెళ్లారు. సాగర్ బ్రిడ్జిపై నుంచి నీటిలో దూకడంతో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. దీంతో స్నేహితులు, గ్రామస్తులు, పోలీసులు తీవ్రంగా గాలింపు చేపట్టడంతో మృతదేహం లభ్యమైంది. రూరల్ ఎస్సై సదాకర్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పండగ రోజు సాగర్‌గౌడ్ మృతిచెందడంతో గ్రామంలో విషాదం చోటుచేసుకుంది.


మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

మహిళ ఖాతా నుంచి డబ్బులు మాయం

- ఇద్దరు నిందితుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన సీఐ రాజు

మంథని: ఓ మహిళ బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు డ్రా చేసి జల్సాలకు ఉపయోగించిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ రాజు తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మంథని మండలం ధర్మారం(గద్దలపల్లి) గ్రామానికి చెందిన కందుకూరి లక్ష్మి కుమారుడు చనిపోగా ఆయన ఖాతాలో ఉన్న రూ.4.49లక్షలు గత సంవత్సరం ఏప్రిల్ 25న తన ఖాతాలోకి బదిలీ చేయించుకుంది. గత సంవత్సరం సెప్టెంబర్ 04 ఆ డబ్బును డ్రా చేసుకునేందుకు బ్యాంకు వెళ్లింది. అయితే, డబ్బులు లేవని బ్యాంకు అధికారులు తెల్పారు. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విచారణ చేసి బ్యాంకు స్టేట్‌మెంట్, టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా నిందితులను గుర్తించారు. సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్‌కు చెందిన దామరకుంట అశోక్, గుండ్ర ప్రశాంత్‌కుమార్ కలిసి లక్ష్మి ఖాతాకు అశోక్ పేటీఎం యాప్ అనుసంధానం చేసి డబ్బులు డ్రాచేశారు. జల్సాలు, కుటుంబ అవసరాలకు డబ్బులు వాడుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. ఎస్సై రమేశ్ పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజు

హత్య కేసులో నిందితుల అరెస్టు

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని కిసాన్‌నగర్‌లో గురువారం ఇరువర్గాల మధ్య గొడవ జరుగగా.. ఒక వ్యక్తి గాయాలపాలై మృతి చెందిన కేసులో ఐదుగురిని త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసు వివరాల ప్రకారం.. భగత్ అనే వ్యక్తి కిసాన్‌నగర్‌లో జరిగిన గొడవలో గాయపడగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. భగత్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితులైన జగదీశ్, శంకర్, భరత్, దీపక్, కృష్ణను నగరంలోని కార్ఖానగడ్డలోని మార్కెట్ సమీపంలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అమరవీరుల ఆశయాలు సాధిస్తాం

- సీపీఐ జాయతీనేత చాడ వెంకటరెడ్డి


అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి

కరీంనగర్: అమరవీరుల ఆశయాలను కొనసాగించడానికి సీపీఐ శ్రేణులు ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. అనభేరి ప్రభాకర్‌రావు 77వ వర్ధంతి సందర్భంగా నగరంలోని వెంకటేశ్వర ఆలయం వద్ద ఉన్న అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహానికి పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామితో పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అమరవీరులు సాగించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని మతోన్మాద బీజేపీ వక్రీకరిస్తోందని, తిప్పికొట్టేందుకు సీపీఐ శ్రేణులు సిద్ధం కావాలని వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్‌కుమార్, అందె స్వామి, బోయిని అశోక్, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, గూడెం లక్ష్మి, టేకుమల్ల సమ్మయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

జమ్మికుంట: బైక్ అదుపు తప్పి విద్యార్థి మృతి చెందిన ఘటన శుక్రవారం జమ్మికుంటలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లికి చెందిన మేదరి అనుదీప్(15) స్నేహితులతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నాడు. ద్విచక్ర వాహనంపై చిన్న కొమిటిపల్లి నుంచి కొత్తపల్లికి వస్తున్న క్రమంలో ఇల్లందకుంట నుంచి చిన్నకొమిటిపల్లికి వెళ్లేదారిలోని చెరువు సమీపంలో బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అనుదీప్ 9వ తరగతి చదువుతున్నాడు. అతని తండ్రి భూమయ్య ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్లపైనే విక్రయాలు


ఇది వేములవాడలో రూ.2.50కోట్లతో నిర్మించిన మున్సిపల్ ఇంటిగ్రేటెడ్ కూరగాయల మార్కెట్. ఇక్కడ కూరగాయల వ్యాపారులు, రైతులు వచ్చి కూరగాయలు విక్రయించుకునేందుకు వీలుగా వసతులు కల్పించారు. అయితే ఇక్కడికి రైతులు, వ్యాపారులు ఎవరూ రావడం లేదు.


రోడ్డుపై కూరగాయలు విక్రయిస్తున్న ఈ దృశ్యం వేములవాడలోని పాపన్నచౌక్. ఎలాంటి వసతులు లేకున్నా నడిరోడ్డుపై కూరగాయలు విక్రయిస్తున్నారు. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూనే వ్యాపారాలు చేస్తున్నారు. వేకువజాము నుంచే వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు, వ్యాపారులు ఇక్కడికి చేరుకుంటారు. రైతుల నుంచి కూరగాయలు కొని వ్యాపారులు విక్రయిస్తుంటారు. అంధకారంతోపాటు ఎలాంటి వసతులు లేవు. అయినా ఇక్కడే ఏళ్లుగా వ్యాపారాలు చేస్తున్నారు.


ఇది వేములవాడ పట్టణంలోని తెలంగాణచౌక్. ఇక్కడ వ్యాపారులు రోడ్డుపై కూరగాయలు విక్రయిస్తున్నారు. మున్సిపల్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో అన్ని వసతులు కల్పించినా ఇలా రోడ్డుపైనే ఇబ్బంది పడుతూనే కూరగాయలు విక్రయిస్తున్నారు.

- మున్సిపల్ మార్కెట్ నిరుపయోగం
- రూ.2.50కోట్లు వృథా
- రహదారులను వీడని వ్యాపారులు

వేములవాడ: అన్ని వసతులతో మున్సిపల్ మార్కెట్ నిర్మించిన కూరగాయల వ్యాపారులు వేములవాడ పట్టణంలో రోడ్లపైనే వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ.. దుమ్ముదూళిలోనే కూరగాయలు విక్రయిస్తున్నారు. రూ.2.50కోట్లు వెచ్చించి అధునాతన మార్కెట్‌ను నిర్మించినా ఉపయోగించుకోవడం లేదు. బైపాస్‌రోడ్లు, తెలంగాణచౌక్, పాపన్నచౌక్‌లలో రోడ్లను ఆనుకుని దుకాణాలు పెట్టి వ్యాపారాలు చేసుకుంటున్నారు.

రూ.2.50కోట్లు వృథాగా..

వేములవాడకు చుట్టుపక్కల పల్లెల నుంచే కాకుండా సిరిసిల్ల, బోయినపల్లి ప్రాంతాల నుంచి కూడా రైతులు తమ కూరగాయలు తెచ్చి ఇక్కడి వ్యాపారులకు విక్రయించి వెళ్తుంటారు. వీళ్లంతా వేకువజామునే వేములవాడకు చేరుకుంటారు. వీరందరి కోసం ప్రభుత్వం రూ.2.50కోట్లు వెచ్చించి మున్సిపల్ ఆధ్వర్యంలో అధునాతన మార్కెట్‌ను నిర్మించింది. అయితే ఇక్కడికి రైతులు, వ్యాపారులు ఎవరూ రావడం లేదు. ఫలితంగా నిరుపయోగంగా మారింది.

చీకటి.. దుమ్ముదూళి

వేములవాడలోని రెండో బైపాస్‌రోడ్డులో గల గంగమ్మగుడి, వైకుంఠధామం ప్రాంతాల్లో కూరగాయల మార్కెట్ కొనసాగుతోంది. మార్కెట్‌యార్డు ముందు వేకువజామున, రోడ్డుపైనే రైతులు, హోల్‌సేల్ వ్యాపారులు వ్యాపారం చేసుకుంటున్నారు. తెలంగాణచౌక్‌లో రోడ్డుపైనే చిన్నచిన్న గుడారాలు ఏర్పాటు చేసుకుని కూరగాయల అమ్ముకుంటున్నారు.

రోడ్డుపైనే విక్రయిస్తున్నాం



మేము కూరగాయల వ్యాపారం చేసుకునే జీవిస్తున్నాం. ముందుగా జవహర్‌లాల్ స్కూల్ వద్ద రోడ్డుపైనే కూరగాయలు అమ్మేవాళ్లం. కరోనా సమయంలో ఆ ప్రాంతాన్ని అధికారులు ఖాళీ చేయించారు. అప్పటి నుంచి రోడ్లే దిక్కవుతున్నాయి.
– అనిల్, కూరగాయల వ్యాపారి, వేములవాడ

బైపాస్‌రోడ్డుకు మార్చారు



కరోనా సమయంలో మార్కెట్‌లో నుంచి బైపాస్‌రోడ్డుకు తరలించారు. ఇక్కడ సౌకర్యాలు లేవు. వసతులు కల్పిస్తే తప్పకుండా అక్కడికి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నాం.
– నరేశ్, కూరగాయల వ్యాపారి, వేములవాడ

పాలసీ డెసిషన్ తీసుకోవాలి

శామకుంటలో కూరగాయల మార్కెట్ నిర్మించి సిద్ధంగా ఉంది. ఇక్కడే వ్యాపారం చేసుకోవాలని వ్యాపారులకు పలుమార్లు సూచించాం. ఎవరూ ముందుకు రావడం లేదు. ఉన్నతాధికారులు పాలసీ డెసిషన్ తీసుకోవాల్సి ఉంటుంది.
– అన్వేశ్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ

ఎస్సారెస్పీ కాలువలో మహిళ గల్లంతు?

కోరుట్లరూరల్: మేడిపల్లి మండలం వల్లంపెల్లి గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కాలువలో ఓ మహిళ పడి గల్లంతైనట్లు తెలిసింది. స్థానికుల వివరాల ప్రకారం.. హోలీ పండగ కావటంతో వల్లంపెల్లి గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కాలువలో యువకులు స్నానాల కోసం వెళ్లగా వంతెన పక్కన గల కాలువ చివరి మెట్ల వద్ద మహిళ చెప్పులు, చిన్న డబ్బుల సంచి కనిపించాయి. సంచిలో సెల్‌ఫోన్ కూడా ఉంది. యువకులు సెల్‌ఫోన్‌లో ఉన్న నంబరుకు ఫోన్ చేయగా కోరుట్ల మండలం మోహన్‌రావుపేటకు చెందిన మాజీ మహిళా సర్పంచ్ పూదరి దేవక్కదేనని బంధువులు తెలిపారు. దీంతో ఆమె కెనాల్‌లో పడి గల్లంతయినట్టు అనుమానిస్తున్నారు. కాగా..భార్య ఆచూకీ తెలియడం లేదని ఆమె భర్త నర్సయ్య పోలీసులకు ఫిర్యాదు చే శాడు.

చెరువులో శవమై తేలేనా..?

ముత్తారం(మంథని): లక్కారం పెద్దచెరువు వద్దకు వెళ్లిన ఓ వ్యక్తి చెరువులో పడి శవమై తేలుతాడా? లేదా బతికే ఉంటాడా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామానికి చెందిన ముదురుకోల సమ్మయ్య(42) హోలీ వేడుకల తర్వాత శుక్రవారం మధ్యాహ్నం చెరువు వద్దకు వెళ్లాడు. అక్కడ సమ్మయ్య ప్యాంట్, షర్టు, పర్సు, ఐడీ కార్డు ఉంది. కానీ, సమ్మయ్య కనిపించలేదని గుర్తించి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. శుక్రవారం రాత్రి ఎస్సై నరేశ్ చెరువు వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అక్కడ లభించిన ఆధార్ కార్డుతో సమ్మయ్య అని గుర్తించామని వివరించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని అక్షయ లాడ్జీలో హైదరాబాద్ నుంచి అమ్మాయిలను తీసుకొచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్న వారిని రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. విశ్వసనీయ సమాచారంతో లాడ్జీపై శుక్రవారం దాడి చేసి అమ్మాయితోపాటు ఓ విటుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పట్టణంలోని లాడ్జీలు, హోటళ్లలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.